క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివారెడ్డి



కొల్లిపర: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొల్లిపరకు చెందిన జొన్నల శివారెడ్డి నియమితులయ్యారు. మిత్ర బృందంతో శుక్రవారం ఆయన ఎమ్మెల్యే శివకుమార్‌ను తెనాలిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి కృషి చేసినందుకు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ నాయకులు కలసికట్టుగా మెలగుతూ, పేదలకు అండగా ఉంటూ సీఎం జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివారెడ్డి నియామకంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళ్లం వీరారెడ్డి, ఎ.కృష్ణారెడ్డి, రవిశేఖరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మణి పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి రాక

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి శనివారం తెనాలి రానున్నారు. స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రమ్‌లో ఎం.వి.ఎస్. కపర్ది శత జయంతి స్మారకోపన్యాస సభ సాయంత్రం ఆరు గంటలకు జరగనుంది. 'నెమరు' పుస్తకాన్నీ ఇదే సభలో ఆవిష్కరిస్తారు. ప్రధాన అతిథిగా ఆ సభలో పాల్గొనేందుకు వస్తున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెనాలి ఆధ్వర్యంలో భారీగా స్వాగతం పలకనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు తెనాలి రూరల్ మండలం నందివెలుగు నుంచి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తారు.

రేపు తెనాలిలో ఫ్యాషన్ షో



తెనాలి అర్బన్: గుమ్మడి ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో ఫ్యాషన్ షో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పరుచూరి రమ్య, గుమ్మడి భావన, గుమ్మడి సాయివాణి తెలిపారు. ముఖ్య అతిథిగా పల్సర్ బైక్ ఝాన్సీ హాజరుకానున్నట్లు చెప్పారు. గెలుపొందిన వారికి బహుమతులు కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

కార్యకర్తల్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న లోకేష్

పోలీసు స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యుల ఫిర్యాదు



పట్నంబజారు : యువగళం పాదయాత్రలో కార్యకర్తల్ని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని పాత గుంటూరు పోలీసు స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి పాత గుంటూరు పీఎస్ సీఐ ఎం.వి.సుబ్బారావును కలసి ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా సభ్యులు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేష్ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా.. ఎక్కువ కేసులు ఉన్నవారికి పదవులు ఇస్తామని వ్యాఖ్యానించడం సిగ్గుచేటని ఖండించారు. కార్యకర్తల్ని రెచ్చగొట్టి అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా రాష్ట్రంలో అల్లర్లు ప్రేరేపించేలా లోకేష్ వ్యాఖ్యలు ఉంటున్నాయని విమర్శించారు. అందులో భాగంగా తమ్మళ్లపల్లి, పుంగనూరు, మాచర్ల వంటి నియోజకవర్గ ప్రాంతాల్లో ఘర్షణలు చేసిన విషయాన్ని ఫిర్యాదులో పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి ఘటనలు జరిగే అవకాశం ఉందని, పచ్చ కార్యకర్తల్ని రెచ్చగొడుతున్న లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్.సాగర్, రహమతుల్లా, గోపి, ఖాదర్, సాయిరాం, రమణకుమార్, హనుమంతరావు, కిరణ్‌కుమార్, మస్తాన్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సెక్షన్‌లో అంతర్గత బదిలీలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సెక్షన్‌లో అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా ఒక ఈఈ, ఇద్దరు డీఈలు, ఇద్దరు ఏఈలు విధుల్లో చేరడంతో వారికి వార్డులు కేటాయించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఏఈలు, డీఈఈలకు వార్డుల వారీగా వర్క్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డివిజన్లకు కేటాయించిన ఇంజినీరింగ్ అధికారులు ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని, అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆమె ఆదేశించారు.

'వార్డులో ఒకరోజు పర్యటన'కు చక్కని స్పందన

- అభ్యర్థనలను పరిష్కరించి నేరుగా ఫోన్ చేస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- ఆనందం వ్యక్తం చేస్తున్న సంబంధిత వ్యక్తులు



సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పట్టణంలో నిర్వహిస్తున్న 'వార్డులో ఒకరోజు'కు చక్కని స్పందన లభిస్తోంది. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఇంటికి వచ్చిన ఎమ్మెల్యేకు చేసిన అభ్యర్థనల్ని నెరవేర్చడమే కాదు...ఆయనే స్వయంగా ఫోను చేసి మరీ వారి మనోగతాన్ని తెలుసుకుంటున్నారు. దీంతో ఆయా వ్యక్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఇందుకు పట్టణ 37వ వార్డు సచివాలయం వేదికగా నిలిచింది. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కమిషనర్ ఎం.జస్వంతరావు, 37వ వార్డు కౌన్సిలరు మల్లెబోయిన సువర్ణ రేఖాదేవి, మల్లెబోయిన రాము, ఇతర మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే శివకుమార్ శుక్రవారం 37వ వార్డులో ఒకరోజు గడిపారు. ముందుగా సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. గడప గడపకులో వచ్చిన సమస్యలు 39 కాగా, వీటిలో 19 పరిష్కరించినట్టు ఉద్యోగులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మిగిలిన వాటిలో కొన్ని పెండింగులో ఉండగా, మరికొన్ని నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో తిరస్కరించారు. ఆయా కారణాల్ని సంబంధిత వ్యక్తులకు తెలియజేయాల్సిందిగా ఎమ్మెల్యే ఆదేశించారు. పరిష్కారమైన సమస్యల్ని ఆరా తీసేందుకని ముగ్గురికి నేరుగా ఫోన్ చేశారు. అమ్మఒడి లబ్ధి కోసం అభ్యర్థించిన మహిళకు, ప్రస్తుతం ఆ లబ్ధి చేకూరుతోంది. ఆ విషయాన్ని లబ్ధిదారు కుటుంబానికి చెందిన గద్దం సతీష్‌కుమార్ వెల్లడించారు. మురుగు కాల్వ సమస్యను వివరించి, కొత్త పైపులైను వేయాలని కోరిన బోడా బాజీబాబు విన్నపాన్ని పరిష్కరించారు. ఫోనులో అదే విషయాన్ని ఆయన చెప్పి సంతోషం వ్యక్తంచేశారు. పఠాన్ నూర్జహాన్ కోరినట్టుగా బియ్యం కార్డులో చేర్పులు చేయించారు. తమ అభ్యర్థనలను ఆలకించి, పరిష్కరించటమే కాకుండా స్వయంగా ఎమ్మెల్యేనే ఫోను చేసి చెప్పడంపై వారు ఆనందాన్ని వ్యక్తంచేశారు. ఆ తర్వాత సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లతో ఎమ్మెల్యే శివకుమార్ వేర్వేరుగా మాట్లాడారు. వారి బాగోగులను విచారించి, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తర్వాత వార్డు కౌన్సిలరు మల్లెబోయిన సువర్ణ రేఖాదేవి నివాసంలో ఆ కుటుంబసభ్యులతో కలసి భోజనం చేశారు. అనంతరం వార్డులోని ముఖ్య కార్యకర్తలు, గృహ సారథులతో సమావేశమయ్యారు. వార్డులోని పరిస్థితులు, అవసరాలను తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో మల్లెబోయిన రాము, దొడ్డక సాంబశివరావు, ఎ.సిరికృష్ణ, అంకిరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

వరములిమ్మా... వరలక్ష్మమ్మా..



అష్టభుజ ఆలయంలో పూజలు



అష్టభుజ ఆలయంలో అలంకరణలో అమ్మవారు



వాసవీ ఆలయంలో కుంకుమ పూజలు



అష్టలక్ష్మి ఆలయంలో భక్తులను ఆశీర్వదిస్తున్న అర్చకుడు



వాసవీ దేవస్థానంలో వ్రతం విశేషాలను వివరిస్తున్న అర్చకుడు

తెనాలి టౌన్: పట్టణంలో వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు. ఇళ్లలో అమ్మవారికి నివేదనలు సమర్పించి, పూజలు నిర్వహించారు. ముత్తయిదువుల్ని పిలిచి పూలు, పండ్లు సమర్పించారు. అనంతరం ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. బోసు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని మహిళలు పెద్దసంఖ్యలో దర్శించుకుని, కుంకుమపూజలు నిర్వహించారు. కొత్తపేటలోని అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారికి విశేషంగా పూజలు జరిపారు. అర్చకులు వరలక్ష్మి వ్రతం గురించి వివరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. బాలాజీరావుపేట అయ్యప్పపురంలోని ప్రధాన అయ్యప్ప దేవాలయంలో శ్రావణమాసం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా విశేష కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు దుర్భా హరిబాబుస్వామి ఆధ్వర్యంలో పలు పూజల్ని నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రేపు చేబ్రోలులో ఉచిత మెగా వైద్య శిబిరం

కొరిటెపాడు(గుంటూరు): చేబ్రోలులోని సూర్యదేవర నర్సయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం గుంటూరు రమేష్ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.వి.నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేబ్రోలు మండల ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్ల సంఘం సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతోందని పేర్కొన్నారు. శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని చేబ్రోలు, చుండూరు మండలాల్లోని గ్రామాల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి

కొల్లిపర: పంట సాగు చేసిన ప్రతి రైతూ ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో కె.వెంకటరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన వరి పంట నమోదును పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సాగు చేసిన పొలం వద్దకు సిబ్బంది వెళ్లి పంట నమోదు చేయాలని చెప్పారు. పంట నమోదు వల్ల నష్టపరిహారం, పంటల బీమా వంటివి రైతులకు అందుతాయని తెలిపారు.

చంద్రయాన్-3 విజయం అభినందనీయం

లక్ష్మీపురం: అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనల్ని కీలక మలుపు తిప్పే ఒక అసాధారణ విన్యాసమైన చంద్రయాన్–3 మిషన్ అఖండ విజయం వెనుక వందలాది శాస్త్రవేత్తల నాలుగేళ్ల కృషి ఉందని అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం చంద్రయాన్–3 విజయంపై అభినందన సభను సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సాంబశివరావు మాట్లాడుతూ ఎవరికీ లొంగని చంద్రుడి దక్షిణ ధ్రువంపై విక్రమ్ లాండర్‌ని దించి తీరాలన్న లక్ష్యంతో మన శాస్త్రవేత్తల సాహస ప్రయత్నం ప్రపంచ దేశాల్ని అబ్బుర పరిచిందని తెలిపారు. ఇదొక చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. గత 41 రోజులుగా అన్ని విభాగాలకు చెందిన శాస్త్రవేత్తలు, పరస్పర సమన్వయంతో రెప్పవాల్చని నిఘాతో చంద్రయాన్‌నే శ్వాసించారని వివరించారు.

చంద్ర మండలం ఎక్కినంత సంబరం

అవార్డులతో తెలుగు సినీ పరిశ్రమ చంద్ర మండలం ఎక్కినంత సంబరం చేసుకుంటుందని సంగీత విద్వాంసుడు పి.మొగిలి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం తెలుగు చిత్ర పరిశ్రమకు అభినందనలు తెలిపారు.

వివాహితకు వేధింపులు

తెనాలి రూరల్: వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. పట్టణంలోని ముత్తంశెట్టిపాలేనికి చెందిన వివాహితకు పక్కింట్లో నివాసం ఉండే శ్రీనివాసరావు ఫోన్ చేసి వేధింపులకు పాల్పడుతున్నాడు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసుల్ని ఆశ్రయించడంతో శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హక్కుల పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగ సంఘాల నాయకులతో కలసి రాజ్యాంగ పరిరక్షణకు సెప్టెంబర్ 9న విజయవాడలో నిర్వహించనున్న సదస్సు సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా సదస్సుకు సంబంధించిన కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అసైన్డ్ భూముల ఆర్డినెన్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం లైజినింగ్ ఆఫీసర్‌ని నియమించాలని విజ్ఞప్తి చేశారు. మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి వారికి రిజర్వేషన్ ఫలాలు అందించాలని విన్నవించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు చార్వాక, కనపర్తి సంగీతరావు, మురికిపూడి దేవపాల్, కిరణ్‌కుమార్, అశోక్‌కుమార్, కోడిరెక్క కోటిరత్నం, నల్లపు నీలాంబరం, నాయకులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు లాక్కొని ఆగంతుకుల పరారీ

గుంటూరు ఈస్ట్: వ్యక్తి మెడలోని బంగారు గొలుసు ఆగంతుకులు లాక్కొని పరారైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేంద్రనగర్‌కు చెందిన పి.వెంకట శ్రీనివాసరావు శుక్రవారం తెల్లవారుజామున నడుచుకుంటూ బృందావన్ గార్డెన్స్ 7వ లైనులోకి వెళుతున్నారు. ఈ సమయంలో ఇద్దరు ద్విచక్ర వాహనంపై వచ్చి శ్రీనివాసరావు మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యకర మెసేజ్ పంపుతున్న వ్యక్తిపై ...

మహిళ సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి అసభ్యకర మెసేజ్‌లు పంపుతున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లికార్జునపేటకు చెందిన మహిళకు గుర్తు తెలియని వ్యక్తి తన సెల్ నంబరు నుంచి అసభ్యకర మెసేజ్‌లు పెడుతున్నాడు. దీంతో ఆమె శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనారిటీ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

లక్ష్మీపురం: మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతుల్ని సెప్టెంబర్ 1నుంచి ప్రారంభిస్తున్నామని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఆయుబ్ హుస్సేన్ తెలిపారు. తూర్పు నియోజక వర్గ పరిధిలోని చౌత్ర సెంటర్, పశ్చిమ నియోజక వర్గ పరిధిలోని కృష్ణానగర్‌లో గల ఉర్దూ అకాడమీ శిక్షణ కేంద్రాల్ని, ఉర్దూ అకాడమీలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కంప్యూటర్ శిక్షణ తరగతుల్ని నిరుద్యోగ యువకులు, విద్యార్థులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాల్ని సమకూర్చాలని నిర్వాహకులకు తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ ఉర్దూ అకాడమీ సంయుక్తంగా మొదటిసారి నిర్వహిస్తున్న తరగతులతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల రూపకల్పన జరుగుతున్నట్లు వివరించారు. మైనారిటీ నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని ఆర్థిక పురోగతి సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ భాషాభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ అహ్మద్, ఉర్దూ డీఐ షేక్ ఖాసిం, శిక్షణా కేంద్రం పర్యవేక్షకులు షేక్ మహిమున్నీసా, కరిముద్దీన్, ఉర్దూ లైబ్రరీ ఇన్‌చార్జ్ నయీం అహ్మద్, జాన్ సైదా, ముస్తాఫా, షేక్ నాగుర్‌బాషా పాల్గొన్నారు.

గంగానమ్మ కొలుపులు ప్రారంభం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: అరండల్‌పేట రజకుల కాలనీలోని గంగానమ్మ తల్లి కొలుపులు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకుడు కమలాకర శర్మ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కలశ పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు, మురళి ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల్ని ఉత్సవ నిర్వాహకులు వై.వి. సాయి రాఘవ, రజక కాలనీ అధ్యక్షుడు వై. కృష్ణ పర్యవేక్షించారు. శనివారం ఉదయం 10 గంటలకు అమ్మవారికి పొంగళ్లు, సాయంత్రం 5 గంటలకు పల్లకీ ఊరేగింపు జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కృష్ణ కోరారు.

మాజీ మంత్రి జలగం ప్రసాదరావుకు సత్కారం



జలగం ప్రసాదరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పట్టణ గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని శుక్రవారం రాత్రి 7.30 గంటలకు మాజీ మంత్రి జలగం ప్రసాదరావు సందర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కుమారుడు, పంచాయతీరాజ్ శాఖ మాజీ మంత్రి జలగం ప్రసాదరావు తెనాలి వచ్చిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యాలయానికి వచ్చిన ప్రసాదరావును ఆత్మీయంగా పలకరించిన ఎమ్మెల్యే శివకుమార్ ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సత్కరించారు. వీరితో బిషప్ కత్తెర సుధీర్‌కుమార్, పార్టీ నాయకులు అక్కిదాసు కిరణ్, మేకల రమేష్, బూరెల దుర్గాప్రసాద్, బొమ్ము నాగిరెడ్డి తదితరులున్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు



అంగలకుదురులో వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

తెనాలి రూరల్: ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు చెప్పారు. అంగలకుదురు ప్రధాన సెంటరులో రోడ్డు పక్కన వ్యాపారాలు నిర్వహించే వారి వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా రూరల్ ఎస్‌ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు శుక్రవారం సాయంత్రం గ్రామంలో పర్యటించారు. దుకాణదారులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని, పాదచారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన సూచించారు. అనంతరం బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణ మార్కెట్ సెంటర్‌లో తోపుడ బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారితో పీసీఆర్ సీఐ కె. శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్‌ఐ బి. శివరామయ్య మాట్లాడారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని సూచించారు.

పత్రాలు లేకుండా ట్రాక్టర్లు నడిపితే చర్యలు



ట్రాక్టర్ పత్రాలను పరిశీలిస్తున్న రవాణా శాఖ అధికారులు

తెనాలి రూరల్: సరైన పత్రాలు, అనుమతులు లేకుండా ట్రాక్టర్లను నడిపితే చర్యలు తీసుకుంటామని తెనాలి ప్రాంతీయ రవాణాధికారి కె. ప్రసాద్ తెలిపారు. తెనాలితో పాటు చేబ్రోలు మండలం వడ్లమూడి వద్ద శుక్రవారం ట్రాక్టర్ల తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు, లైసెన్సులు లేని ట్రాక్టర్లను గుర్తించి అపరాధ రుసుం విధించారు. ట్రాక్టర్లతో పాటు ట్రైయిలర్లకూ అన్ని అనుమతులు ఉండాలని చెప్పారు. లైసెన్సు లేకుండా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం పట్టణంలోని మోటారు వాహనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్‌లకు వినియోగిస్తున్న వాహన్ వెబ్‌సైట్, యాప్‌లో ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆయన వెంట ఎంవీఐ టి. రాఘవరావు, ఏఎంవీఐ ఎస్.బి. మధుసూదనరావు ఉన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఆరోగ్య భరోసా



వల్లభాపురంలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

వల్లభాపురం(కొల్లిపర): ఫ్యామిలీ డాక్టర్ సేవలతో పల్లె ప్రజలకు ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయని మండల వైద్యాధికారిణి చిక్కాల లక్ష్మీసుధ పేర్కొన్నారు. మండలంలోని వల్లభాపురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పేదలకు వైద్యసేవలు అందించారు. గ్రామంలో దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ బొమ్ము కోటిరెడ్డి, ఎంఎల్‌హెచ్ పి.సరళ, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి కూరపాటి శ్యామ్ జ్యోతి, ఆశా కార్యకర్త కృష్ణకుమారి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

తెనాలి టౌన్: పట్టణ శివాజీ చౌక్ సెంటర్‌లో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో కొత్త ఓటర్లను చేర్చడం, రెండు చోట్ల ఓట్లు ఉంటే వాటిని తొలగించడం, అక్రమంగా ఓట్లు లేకుండా చూసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నూతన ఓటు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.అనంతాచార్యులు, అన్నవరపు వేణు, మైలా హరికృష్ణ, బొల్లిముంత విజయకుమార్, బోడపాటి వినయ్‌కుమార్, ఆదిత్య, శిఖా రవీంద్ర, కుశల్‌రాజ్ జైన్ పాల్గొన్నారు.

గుర్రపు డెక్క, తూటికాడతో నీటి పారుదలకు ఆటంకం



గుడివాడలోని కాల్వలో తూటికాడను పరిశీలిస్తున్న శివసాంబిరెడ్డి

తెనాలి టౌన్: రూరల్ మండలంలోని గుడివాడ, కోపల్లె, అంగలకుదురు గ్రామాల మీదుగా వెళ్లే జీఆర్‌బీసీ మురుగు కాల్వలో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపుడెక్క ఆకుల్ని వెంటనే తొలగించి రైతుల్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అధికారుల్ని కోరారు. సకాలంలో తూటికాడ, గుర్రపు డెక్క ఆకులు తొలగించకపోవడం వల్ల మురుగునీరు పారుదల కావడం లేదని చెప్పారు. సమస్యల్ని డ్రైనేజీ డీఈఈ ఎం.అనిల్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయన వెంట రైతులు సురేష్, అశోక్, మోహనరావు ఉన్నారు.

తేజేశ్వర్‌కు అభినందనలు



గుంటూరు వెస్ట్: పోలాండ్‌లో ఈ నెల 10 నుంచి 20 వరకు జరిగిన ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ (ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్) ఫైనల్స్‌లో నెగ్గి బంగారు పతకం సాధించిన కోడూరి తేజేశ్వర్‌ను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని చాంబర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమని కొనియాడారు. మన యువత దేశవిదేశాల్లో ప్రతిభకనబరచడం దేశానికే గర్వకారణమన్నారు. నిత్యం నేర్చుకునే విధంగా ఉండాలని చెప్పారు. విజయవాడకు చెందిన ఫిట్జి విద్యాసంస్థ పిన్నెపు రమేష్‌బాబు సంస్థ తరఫున తేజేశ్వర్‌కు రూ.10 లక్షల రివార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.